సాక్షి
పల్నాడు
I
గురువారం । 11 । ఏప్రిల్ । 2024



పిడుగురాళ్లలో జరిగిన సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అంబటి, అనిల్, ఎమ్మెల్యేలు, రీజనల్ కో ఆర్డినేటర్ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తదితరులు





బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద బస్సు యాత్రకు హాజరైన జనసందోహంలో ఓ భాగం. ఇన్‌సెట్‌లో ఫ్యాన్ గుర్తును చూపుతున్న వైఎస్ జగన్

పల్నాట జైత్రయాత్ర

జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పల్నాటి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మండుటెండను లెక్క చేయకుండా అభిమాన నేత చూసేందుకు రోడ్లపైకి వచ్చారు. గంటల తరబడి నిరీక్షించారు. జననేతపై పూల వర్షం కురిపించి అభిమానం చాటుకున్నారు. మనవడిని చూసి అవ్వలు తాతలు..అన్నను చూసి చెల్లెమ్మలు మురిసిపోయారు. తమ నేతను చూసి, అయ్యా నువ్వే మళ్లీ సీఎం కావాలయ్యా అంటూ దీవెనలు అందించారు. కొందరు మహిళలు బస్సు ముందు గుమ్మడికాయతో దిష్టి తీశారు. దారి పొడవునా యువకులు పెద్ద జెండాలు పట్టుకుని జై జగన్ అంటూ మోటారు బైకులపై ముందుండి నడిపించారు. పెత్తందారులపై పోరుకు సిద్ధమా అన్న జగన్ మాటలకు మేమంతా సిద్ధం అంటూ లక్షలాది మంది గొంతు కలిపారు. బుధవారం పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి బయలుదేరి బస్సు యాత్ర పిడుగురాళ్ల వరకు అక్కడ నుంచి ధూళిపాళ్ల వరకు దిగ్విజయంగా కొనసాగింది.

- పిడుగురాళ్లలో సీఎం వైఎస్ జగన్ బహిరంగ సభ
- భారీగా తరలివచ్చిన జనసందోహం
- మండుటెండను లెక్క చేయని ప్రజలు
- ముఖ్యమంత్రి ప్రసంగానికి విశేష స్పందన
- గంటావారిపాలెం నుంచి మొదలైన యాత్ర
- యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు
- బస్సుయాత్రలో అన్ని వర్గాల ప్రజలతో మమేకం





అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, బస్సుపై అనిల్‌కుమార్ యాదవ్, అంబటి



మామను చూడు... చిన్నారిని పైకెత్తుకున్న ఓ తండ్రి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తన సెల్‌ఫోన్‌తో ఫొటో తీస్తున్న చిన్నారి

జిల్లాలో అభ్యర్థులు





ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసరావుపేట పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు పోటీచేస్తున్న అభ్యర్థులను సభకు పరిచయం చేశారు. పార్లమెంట్ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, సత్తెనపల్లి, మాచర్ల, నరసరావుపేట, గురజాల, వినుకొండ, పెదకూరపాడు, చిలకలూరిపేట అసెంబ్లీ అభ్యర్థులు అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరరావు, కావటి శివనాగమనోహర్ నాయుడు

సాక్షి,నరసరావుపేట: నిప్పులు చెరుగుతున్న సూర్యుడిని లెక్కచేయకుండా తమ గుండెల్లో కొలువైన అభిమాన నేతను చూసేందుకు పల్నాడు ప్రజలు పోటెత్తారు. వీరి అభిమానం ముందు భానుడి ప్రతాపం చిన్నబోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా బుధవారం పిడుగురాళ్లలో నిర్వహించిన బహిరంగసభకు పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరయ్యారు. తమ అభిమాన నేతను చూడగానే వారిలో అభిమానం ఉప్పొంగింది. జననేత నోటి నుంచి వచ్చిన ప్రతిమాటకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చింది. ర్యాంప్‌పై సీఎం నడుస్తున్న సమయంలో అభిమానుల ఆనందం అంతాఇంత కాదు. పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను పరిచయం చేసి వారిని ఆశీర్వదించమని, గెలిపించమని పల్నాడు ప్రజలను కోరారు.

పార్టీలో చేరికలు

మేమంతా సిద్ధం బస్సు యాత్ర 12వ రోజుకు చేరింది. రాత్రి బస కేంద్రం గంటావారిపాలెం నుంచి బుధవారం ఉదయం 10.15గంటలకు యాత్ర మొదలైంది. అంతకుముందు వైఎస్సార్ సీపీలోకి మాజీ ఎమ్మెల్యేలు ఆర్.రమేష్‌రెడ్డి, పాముల రాజేశ్వరిదేవి, జనసేన పార్టీ విజయవాడ వెస్ట్ ఇన్‌చార్జిగా పనిచేసిన పోతిన మహేష్‌లను సీఎం వైఎస్ జగన్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారితోపాటు వచ్చిన ముఖ్యనేతలను పార్టీలోకి చేర్చుకున్నారు. బస కేంద్రం ఎదుట వేచి ఉన్న పలువురితో మా ట్లాడి వారి సమస్యలకు పరిష్కారం చూపారు. అక్కడి వేచి ఉన్న వందలాది మంది అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. కామేపల్లి మీదుగా సంతమాగులూరు అడ్డరోడ్డు వద్దకు యాత్ర చేరుకుంది. అక్కడ అప్పటికే వేచి ఉన్న వేలాది మందిని బస్సు టాప్‌పైకి ఎక్కి అభివాదం చేశాడు. చెప్పులు తెగి కాళ్లు కాలిపోతున్నా పరుగులు పెడుతున్న వెంకాయమ్మను ఆత్మీయంగా పలకరించారు. ఆ తర్వాత వెంకాయమ్మ సంబరపడిపోయింది.



నిలువెత్తు అభిమానం.. వైఎస్ జగన్‌కు గజమాలతో స్వాగతం

గుమ్మడికాయలతో దిష్టి తీసి...

బస్సుయాత్ర రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు చేరుకోగానే నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆ నియోజకవర్గ నేతలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. మేమంతా సిద్ధం పేరుతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఇది చూసి ప్రతిపక్షాలకు కళ్లతో దిష్టి తగిలి ఉంటుందని, తమనేతకు అంతా మంచే జరగాలన్న ఉద్దేశంతో రొంపిచర్ల మండలం అన్నవరప్పాడు అక్కచెల్లెమ్మలు గుమ్మడికాయలతో దిష్టి తీశారు. తరువాత భారీ గజమాలతో జననేతకు స్వాగతం పలికారు. మళ్లీ మీ ప్రభుత్వమే రావాలంటూ నినాదాలు చేశారు. యాదవ సామాజికవర్గానికి చెందిన రమేష్ బహుకరించిన గొర్రె పిల్లలను ఎత్తుకొని, గొంగలి వేసుకొని వైఎస్ జగన్ మురిసిపోయారు. తరువాత సుబ్బయ్యపాలెం శివారులో తన కోసం వేచి ఉన్న మిర్చి కోత కూలీలతో మాట కలిపారు.

పింఛన్‌దారుల సంఘీభావం

బస్సు యాత్ర రొంపిచర్ల నుంచి సంతగుడిపాడుకి చేరుకుంది. అక్కడ తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన మహిళలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాటామంతీ కలిపారు. ప్రభుత్వం నుంచి అన్ని పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రశ్నించగా, ఏ వివక్ష లేకుండా మీ పాలనలో హాయిగా బతుకుతున్నామని మహిళలు జగనన్నకు సమాధానమిచ్చారు. అక్కడి నుంచి మర్రిచెట్టుపాలెంకు యాత్ర చేరుకోగానే వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు వైఎస్ జగన్‌ను కలిసి యాత్రకు సంఘీభావం తెలిపారు. మీ పాలనలో నెల నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే రూ.3 వేల నగదు అందజేస్తున్నారని తెలిపారు. అక్కడి నుంచి నకరికల్లు అడ్డరోడ్డు, చల్లగుండ్ల మీదుగా నకరికల్లుకు చేరుకుంది. యాత్రకు అడుగడుగునా అపూర్వ స్పందన వస్తుండటంతో అనుకున్న షెడ్యూల్ కన్నా సుమారు మూడు గంటలు ఆలస్యం అయినా ప్రతి పల్లె వద్ద మహిళలు, వృద్ధులు ఎండను లెక్కచేయకుండా వేచి ఉన్న దృశ్యాలు కనిపించాయి. యాత్ర శ్రీరాంపురం తండా, త్రిపురాపురం, శ్రీనివాసనగర్, పెద నెమలిపురిల మీదుగా మధ్యాహ్నం భోజన విరామం కోసం దేవరంపాడు వద్ద ఏర్పాటుచేసిన బస వద్దకు సాయంత్రం 4.20గంటలకు చేరుకున్నారు. కొంత విరామం తరువాత సీఎం వైఎస్ జగన్ పిడుగురాళ్ల చేరుకున్నారు.

మా వెంట అభిమానించే జనం ఉన్నారు

పిడుగురాళ్ల రూరల్/పిడుగురాళ్ల టౌన్: టీడీపీ నాయకులు మా దగ్గర డబ్బు ఉంది.. మీ దగ్గర ఏముందని అంటున్నారు..నేను చెబుతున్నా..మమ్మల్ని ఆదరించే కార్యకర్తలు, అభిమానించే జనం ఉన్నారని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పిడుగురాళ్లలో బుధవారం జరిగిన మేమంతా సిద్ధం సభలో ఆయన మాట్లాడారు. గురజాల నియోజకవర్గంలో రూ.1964 కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు.

ధూళిపాళ్ల వద్ద రాత్రి బస..

మేమంతా సిద్ధం బహిరంగ సభ అనంతరం సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర ప్రారంభించి కొండమోడు జంక్షన్, కోటనెమలిపురి, అనుపాలెం మీదుగా యాత్ర సాగింది. తనకోసం వేచి ఉన్న అభిమానులకు అభివాదం చేస్తూ యాత్ర ముందుకు సాగింది. అక్కడి నుంచి బెల్లంకొండ, రాజుపాలెం మీదుగా రెడ్డిగూడెం చేరగా అక్కడ వేచి ఉన్న మహిళలు, అభిమానులు బస్స ముందుకు వచ్చి కాసేపు ఆగాలని పట్టుబట్టారు. దీంతో బస్సు టాప్ పైకి వెళ్లి అందరికి అభివాదం చేసి ముందుకు సాగారు. ధూళిపాళ్ల శివారులో ఏర్పాటు చేసిన రాత్రి బస కేంద్రం వద్దకు రాత్రి 9.10 గంటలకు చేరుకోవడంతో మేమంతా సిద్ధం సభ 12 రోజు యాత్ర విజయవంతంగా ముగిసింది.

సమస్యలు వింటూ.. భరోసా నిస్తూ

తనకు సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని అక్కున చేర్చుకొని వారి బాధలను వైఎస్ జగన్ తెలుసుకున్నారు. వారికి భరోసా కల్పించి, సహాయానికి తక్షణ ఆదేశాలు జారీచేశారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న సంతమాగలూరు మండలం కొమ్మాలపాడుకు చెందిన షేక్ హుస్సేన్ బాషాకు ఆరోగ్యశ్రీ ద్వారా తగిన చికిత్స అందేలా చూడాలని అధికారులకు సూచించారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన మొగలి సరస్వతికి చికిత్సకు భరోసానిచ్చారు. నూజెండ్ల మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన నామేపల్లి ఆదిత్య, శావల్యాపురం మండలం వయ్యకల్లు గ్రామానికి చెందిన శాఖమూరి విజయలక్ష్మిలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తమ సమస్యను వివరించగా పరిష్కారిస్తామని భరోసా ఇచ్చారు.



అన్నా ఒక్క ఫొటో... సెల్‌ఫోన్‌లో ఫొటో తీస్తున్న జనం



ఆనందం... జగనన్నను చూసేందుకు వచ్చిన మహిళలు



అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, పక్కన అనిల్, గోపిరెడ్డి



నారా దిష్టిపోవాలి... జగనన్నకు దిష్టి తీస్తున్న మహిళలు


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పిన్నెల్లి


పార్టీలో చేరిన మాచర్ల నాయకులతో పీఆర్కే

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

వెల్దుర్తి: మండలంలోని గంగలకుంట గ్రామ నాయకులు సబ్బసాని కోటిరెడ్డి, గోళ్ళ యర్ర బ్బాయి ఆధ్వర్యంలో టీడీపీ చెందిన చెరుకూరి తిరుపతయ్య, భీమవరపు గురవయ్య, శ్రీను, రెంటాల పేరయ్య, కోటేశ్వరరావు, కోటయ్యతో పాటు మరో రెండు కుటుంబాల వారు టీడీపీని వీడి బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు.

సీఎం జగన్‌కు జేజేలు

మాచర్ల: మాచర్లలోని 25వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సమక్షంలో బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వారిని ఎమ్మెల్యే పీఆర్కే సాదరంగా ఆహ్వానించి, పార్టీ కండువాలు కప్పారు.

ముటుకూరు నుంచి...

దుర్గి: మండలంలోని ముటుకూరు గ్రామంలోని టీడీపీకి చెందిన 20 కుటుంబాల ప్రజలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీఆర్కే పార్టీ కండువాలు కప్పి, వారిని సాదరంగా ఆహ్వానించారు.

ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో..

బెల్లంకొండ: మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం, రామాంజనేయపురం గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి పార్టీ కండువాలు కప్పి, సాదరంగా ఆహ్వానించారు.


ముటుకూరు వాసులతో ఎమ్మెల్యే పిన్నెల్లి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంకరరావు

సిద్ధమని మొట్టమొదట చెయ్యి లేపింది రాంబాబు అన్నే

పల్నాడు జిల్లా ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థుల పరిచయ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్

పట్నంబజారు: 'మొట్టమొదటగా సిద్ధమంటూ చెయ్యి లేపింది.. ఎవరైనా ఉన్నారంటే అది మంత్రి అంబటి రాంబాబు అన్నే.' అని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా జరిగిన బహిరంగ సభలో నరసరావుపేట పార్లమెంట్ పరిధిలోని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను ఒక్కొక్కరిని సీఎం ప్రజలకు పరిచయం చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురించి చెబుతూ.. 'సత్తెనపల్లి నుంచి రాంబాబు అన్న నిలబడుతున్నారు. నిజంగా సిద్ధమని మొట్టమొదటిగా చెయ్యి లేపింది..ఎవరైనా ఉన్నారంటే రాంబాబు అన్న. అన్న దగ్గర నుంచే సిద్ధమని చెయ్యి పైకి లేచింది. రాంబాబు అన్నకు మీ సంపూర్ణ మద్దతు తెలియజేయాలి. పల్నాడు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి మన అభ్యర్థులను పరిచయం చేస్తున్నాను. మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు, వారిపై ఉంచాలి'.అని అన్నారు.

అభ్యర్థులను పరిచయం చేస్తూ...

నరసరావుపేట పార్లమెంటుకు సంబంధించి అభ్యర్థుల పరిచయం ప్రారంభిస్తూ.. మొట్టమొదటి సారిగా నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌ను సీఎం జగన్ పరిచయం చేశారు. పల్నాడు జిల్లా నుంచి ఎంపీ అభ్యర్థిగా తన తమ్ముడు నిలబడుతున్నాడని, బలహీన వర్గాల నుంచి వచ్చిన వాడని, పల్నాడు ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటాడని అన్నారు. అలాగే..'గురజాల నుంచి మహేష్ నిలబడుతున్నాడు. మీ అందరికి పరిచయస్తుడే. యువకుడు, ఉత్సాహవంతుడు, అన్నింటికి మించి నాకు మంచి తమ్ముడు కూడా. మీ అందరి చల్లని దీవెనలు మహేష్‌పై ఉంచవల్సిందిగా ప్రార్థిస్తున్నాను'. అని అన్నారు. 'మాచర్ల నుంచి రామకృష్ణారెడ్డి నిలబడుతున్నాడు. సౌమ్యుడు, నా స్నేహితుడు. మీ అందరికి మంచి చేసే విషయంలో ఎప్పుడూ ముందు ఉంటాడు.' అని పరిచయం చేశారు. 'చిలకలూరిపేట నుంచి మనోహర్ నిలబడుతున్నాడు. మంచివాడు, యువకుడు, ఉత్సాహవంతుడు, నాకు తమ్ముడు. మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు మనోహర్‌పై ఉంచాల్సిందిగా సవినయంగాప్రార్థిస్తున్నాను' అని పరిచయం చేశారు. 'పెదకూరపాడు నుంచి శంకరరావు అన్న నిలబడుతున్నాడు. నిజంగా మంచితనంలో ఎవరికైనా మార్కులు వేయాలంటే శంకరరావు అన్నకే ఖచ్చితంగా వేయాలని నేను చెబుతాను. మంచివాడు, పేదలకు మంచి చేసే విషయంలో ఎప్పుడూ కూడా వెనుకడుగు వేసే మనస్తత్వం కాదు. అన్నకు మీ సంపూర్ణ మద్దతు తెలియజేయాలని ప్రార్థిస్తున్నాను.' అని చెప్పారు. 'నరసరావుపేట నుంచి శ్రీను అన్న నిలబడుతున్నాడు. డాక్టర్‌గా మీ అందరికి పరిచయస్తుడే. మంచివాడు, సౌమ్యుడు శ్రీను అన్నకు మీ చల్లని దీవెనలు, ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంచాలని సవినయంగా ప్రార్థిస్తున్నాను.' అని ప్రజలకు వివరించారు. 'వినుకొండ నుంచి బ్రహ్మనాయుడు అన్న నిలబడుతున్నాడు. నిజంగా మనసులో కల్మషం లేనివాడు, ఎవరైనా వస్తే ఎప్పుడూ కూడా సహాయం చేయడంలో ముందుంటాడు. మంచివాడు, సౌమ్యుడు, మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు అన్నపై ఉంచాల్సిందిగా ప్రార్థిస్తున్నాను.' అంటూ ఒక్కొక్కరిగా వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అభ్యర్థులను సీఎం జగన్ పరిచయం చేశారు.


దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

మన గుర్తు ఫ్యానుపై ఓటు వేసి గెలిపించండి

'మన గుర్తు అక్కడో.. ఇక్కడో... ఎక్కడో... ఎవరైనా పొరపాటున మరిచిపోయి ఉన్నా, తెలియక పోయినా.. మన గుర్తు ఫ్యాను. అక్కడ ఉన్న అవ్వలు, అక్కలు మన గుర్తు ఫ్యాన్..' అని ఫ్యాను గుర్తును సీఎం వై.ఎస్.జగన్ ప్రజలకు చూపించారు. పేదల భవిష్యత్తు కోసం ఫ్యాను ఎప్పుడూ కూడా ఇంట్లోనే ఉండాలని, సైకిల్ ఎప్పుడూ బయటే ఉండాలని చెప్పారు. తాగేసిన టీ గ్లాస్ ఎప్పుడూ సింకులోనే ఉండాలన్నారు. మన బతుకులు బాగుపడాలంటే రెండు ఓట్లు ఖచ్చితంగా ఫ్యాను గుర్తుకు వేయాలని, ఖచ్చితంగా గుర్తు పెట్టుకోమని సవినయంగా ప్రార్థిస్తున్నట్లు సీఎం అన్నారు. 'మీ చల్లని దీవెనలకు, ఆశీస్సులకు, మీ బిడ్డ రెండు చేతులు జోడించి పేరు పేరున హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాడు. కాస్త చీకటి పడింది.. కాబట్టి దయచేసి 7 గంటలు అవుతోంది. ఎవరూ కూడా మరోలా అనుకోవద్దండి.. ముందే అయిపోయి ఉంటే 6.30 గంటల్లోపు అయిపోయి ఉంటే ఖచ్చితంగా అంతదాక వచ్చి ఉండదు. 7 గంటలు అయిపోయింది. కాబట్టి సెక్యూరిటీ వారు వద్దంటున్నారు. కాబట్టి ఏ ఒక్కరు కూడా మరోలా అనుకోవద్దని సవినయంగా కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. అని సీఎం వై.ఎస్.జగన్ తన ప్రసంగాన్ని ముగించారు.

చిన్నబోయిన భానుడు

గురజాల/పిడుగురాళ్ల : భానుడు ప్రతాపం సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలకున్న అభిమానం ముందు తల వంచక తప్పలేదు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర వినుకొండ నుంచి నకరికల్లు మీదుగా గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్లకు చెరుకుంది. పిడుగురాళ్లకు వచ్చే సరికి సాయంత్రం 4 గంటలు అయ్యింది. భానుడు ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. అయినా సరే మహిళలు, చిన్నారులు, దివ్యాంగులు ఎండను కూడా లెక్కచేయకుండా మిద్దెలు, డాబాలు ఎక్కి, రోడ్లపైకి వచ్చి జగన్ రాకకోసం ఎదురు చూశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. చిన్నారులను వారి తల్లిదండ్రులు భుజానికి ఎత్తుకుని జగన్ మామయ్య అడుగో అంటూ చూపించారు.

క్లుప్తంగా

మంత్రి అంబటి రంజాన్ శుభాకాంక్షలు

సత్తెనపల్లి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సేవాభావం పెంపొందించుకోవాలని, సోదర భావంతో మెలగాలని సూచించారు. ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మద్య రహిత ఎన్నికలకు కృషి



నరసరావుపేట టౌన్: మద్యం రహిత ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఈబీ జాయింట్ కమిషనర్ బి.అరుణ్‌రావు అన్నారు. బుధవారం ఎస్ఈబీ అధికారులతో జిల్లా సూపరింటెండెంట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళి తప్పక అమలయ్యేలా పనిచేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం రవాణా, నాటు సారా విక్రయాలు జరగకుండా పటిష్ట నిఘా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ షేక్ ఖాజామోహీద్దిన్, ఏఈఎస్ జి.నరసింహారావు, సెబ్ సీఐ నయనతార, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు , దారి మళ్లింపు

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల దృష్ట్యా పలు రైళ్ల రద్దుతో పాటు దారి మళ్లించనున్నట్లు సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రైలు నంబర్ 07464ను (విజయవాడ-గుంటూరు), 07465 (గుంటూరు-విజయవాడ), 07976 (గుంటూరు-విజయవాడ) ఈనెల 10 నుంచి 30 వరకు రద్దు చేసినట్లు తెలిపారు. రైలు నంబర్ 17239ను (ఎస్ఎస్ఎస్ హుబ్లీ-విజయవాడ)ను ఈనెల 9నుంచి 29వరకు గుంటూరు-విజయవాడ స్టేషన్ల మీదుగా తాత్కాలిక రద్దు చేసినట్లు పేర్కొన్నారు. రైలు నంబర్ 17330ను (విజయవాడ-ఎస్ఎస్ఎస్ హుబ్లీ)ను ఈ నెల 10నుంచి 30 వరకు విజయవాడ-గుంటూరు స్టేషన్ల మీదుగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలియజేశారు. రైలు నంబర్ 12077ను (చెన్నై సెంట్రల్- విజయవాడ) ఈనెల 10నుంచి తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించనున్నట్లు వివరించారు. రైలు నంబర్ 16031ను (చెన్నై సెంట్రల్-ఎస్ఎంవీడి కత్రా) ఈనెల 10నుంచి తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించినట్లు తెలిపారు. రైలు నంబర్ 16903ను (చెన్నై సెంట్రల్-లక్నో) ఈనెల 13 నుంచి 30 వరకు తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా దారి మళ్లించినట్లు వివరించారు. ప్రయాణికులంతా గమనించాలని ఆయన కోరారు.

ఈద్గాల వద్ద కట్టుదిట్ట భద్రత ఏర్పాట్లు

నగరంపాలెం: రంజాన్ పురస్కరించుకుని నమాజు జరిగే ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లను చేయాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ బుధవారం ఒక ప్రకటనలో పోలీస్ అధికారులను ఆదేశించారు. గుంటూరు నగర పరిధిలోని ఆంధ్ర ముస్లిం కళాశాల, ప్రభుత్వ ఉర్దూ పాఠశాల, రమేష్ ఆసుపత్రి వద్దనున్న ఈద్గాలు, మంగళగిరి, తెనాలి, ప్రత్తిపాడు, పొన్నూరు, మేడికొండూరు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లోనూ భద్రతా పరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అభిమాన ప్రభం'జనం'

సీఎం వైఎస్ జగన్ 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర అభిమాన ప్రభం'జనం' మధ్య సాగింది. గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల లోని అయ్యప్ప నగర్‌కు భారీ బహిరంగ సభా వేదిక వద్దకు చేరుకునే వరకు తమ అభిమాన నేతను ఒక్కసారి చూసేందుకు ప్రజలు రోడ్డు వెంబడి బారులు తీరారు. సంక్షేమ పథకాలతో తమ జీవితాల్లో వెలుగులు నింపిన మనసున్న నాయకుడికి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. -సాక్షి నెట్‌వర్క్

జగన్ మామయ్యను చూద్దామని వచ్చాం



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉండేవి. చదువుకునేందుకు ఇబ్బందికరంగా ఉండేది. జగన్ మామయ్య సీఎం అయ్యాక నాడు-నేడు ద్వారా మా పాఠశాలల్ని అభివృద్ధి చేసి, చదువుకునేందుకు మంచి వాతావరణం కల్పించారు. ఎప్పుడూ టీవీలు, పేపర్లలో చూసే మేము.. ఆయన ఈ రోజు మా ఊరికి వస్తున్నారని తెలియడంతో చూసేందుకు వచ్చాం. జగన్ మామయ్య మా వైపు చూసి అభివాదం చేయడం ఎంతో ఆనందాన్ని కలిగించింది.

– విద్యార్థినులు శ్రీలక్ష్మీ దుర్గ, నాగమణి, దివ్య, వసంత, త్రిపురాపురం, నకిరేకల్లు.

నా బిడ్డ ప్రాణం కాపాడతానన్నారు



నా బిడ్డ రాజు నాయక్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. జగనన్న ప్రతి నెలా రూ.10 వేలు పింఛన్ ఇస్తుండటంతో 20 రోజులకొకసారి రక్త మార్పిడి చేస్తూ బిడ్డను బతికించుకుంటున్నా. నా కుమారుడికి బోన్ మ్యారో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పారు. రూ.25లక్షలు ఖర్చు అవుతుంది. నిరుపేదను అయిన నాకు శస్త్ర చికిత్స చేయించే స్తోమత లేదు. సిద్ధం సభకు వస్తున్న జగన్‌మోహన్ రెడ్డిని కలిసి నా కుమారుడి సమస్యను వివరించా. నా బిడ్డ ప్రాణాన్ని కాపాడుతానని మాట ఇచ్చాడు. జగనన్న మా పాలిట దేవుడిలా కనిపించారు.

– వెంకటేష్ నాయక్, శ్రీనగర్, దాచేపల్లి.

బిడ్డను ఆశీర్వదించడానికి వచ్చాం



మా బిడ్డ జగన్ ప్రతి నెలా రూ.3 వేలు పింఛన్‌ను ఠంచన్‌గా ఇస్తున్నాడు. మా ఊరి మీదుగా వెళ్తున్న ఆయనను చూసి ఆశీర్వదించాలని మండు టెండను సైతం లెక్కచేయకుండా వచ్చాం. మేము దూరంగా ఉండి నమస్కారం పెడితే ఆయన కూడా తిరిగి నమస్కారం పెట్టారు. ఆయన్ను చూడటం చాలా ఆనందంగా ఉంది. మరలా సీఎం చేసుకునే బాధ్యత మాది. మాలాంటి పండుటాకుల దీవెనలు జగన్‌కి ఎల్లప్పుడూ ఉంటాయి.

– కె. వెంకాయమ్మ, ఎం.అలివేలమ్మ, టి.సూరమ్మ, త్రిపురాపురం, నకిరేకల్లు.

జగనన్న దయతో ఎంబీబీఎస్



మాది మధ్య తరగతి కుటుంబం. డాక్టర్ కావాలనేది నా కల. ఎంబీబీఎస్ చదివే ఆర్థిక స్తోమత మాకు లేదు. మా అమ్మ నా చదువు కోసం ఎంతో బెంగపెట్టుకుంది. జగనన్నను ఒకసారి కలిసి సీటు కావాలని అడిగితే పైసా ఖర్చు లేకుండా నాకు ఇప్పించారు. ఇప్పుడు నేను ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నా. నాలాంటి సామాన్య విద్యార్థిని కలను సాకారం చేయడం జగనన్నకు మాత్రమే సాధ్యమైంది. నాకు మేలు చేసిన ఆయన్ను చూసేందుకు ఇంతదూరం వచ్చా.

– వంగా భవాని, ఎంబీబీఎస్ విద్యార్థిని, శ్రీనగర్ (దాచేపల్లి మండలం)

సకాలంలో అందుతున్న ప్రభుత్వ పథకాలు



నాకు రైతు భరోసా, పెన్షన్ సకాలంలో అందుతున్నాయి. దీంతో మండుటెండలో కూడా జగన్‌ను చూసేందుకు ఎదురు చూస్తున్నాం. ఈ రాష్ట్రంలో ఆయన నాయకత్వంలోనే మాలాంటి వృద్ధులకు న్యాయం జరుగుతుంది. చంద్రబాబులాంటి కుట్రదారుడికి 2024తో ముగింపు పలుకుతాం. వలంటీర్లు, సచివాలయాలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా జగన్ చర్యలు తీసుకున్నారు.

-గోపు అంజిరెడ్డి, సత్తెనపల్లి, రైతు

మా బిడ్డ జగనయ్యా..



మా బిడ్డ జగనయ్యా. సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఎంతగానో అండగా నిలిచాడు. వలంటీర్లు ప్రతి నెల ఇంటి తలుపు తట్టి పెన్షన్ ఇచ్చారు. అటువంటి వారిని చంద్రబాబు లేకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నాడు. తగిన గుణపాఠం చెబుతాం. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యం

- మారెళ్ళ శేషారత్నం, చల్లగుండ్ల పాలెం, సత్తెనపల్లి.

బాగా పనిచేయండి అన్నారు..



ప్రజలకు మెరుగైన సేవలు అందించండి అంటూ వలంటీర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సూచించారు. మహిళా వలంటీర్లకు ఆశీర్వచనాలు అందజేశారు. ఆయనను దగ్గరగా చూడటంతో పాటు మాట్లాడే అవకాశం లభించడం గ్రామ వలంటీర్‌గా అది నా అదృష్టంగా భావిస్తున్నా.

-షేక్ జానీమూన్, వలంటీర్, విప్పర్ల, రొంపిచర్ల మండలం

నా మనవడిని చూడటానికి వచ్చా



నరసరావుపేట రూరల్: నాకు జగన్ అంటే ప్రాణం. చిన్న వయస్సులోనే చాలా కష్టాలు అనుభవించాడు. అందరూ ఒక్కటై జగన్‌ను చాలా ఇబ్బందులు పెట్టారు. అవి అన్నీ చూసి జగన్‌కు అండగా నిలవాలని నిర్ణయించుకున్నా. ఈ ప్రాంతంలో ఎప్పుడూ పర్యటించినా జగన్‌ను కలుస్తాం. గతంలో మా ఊరు వచ్చినప్పుడు కలిసి జ్ఞాపికలు కూడా అందజేసా. ఇప్పుడు నా వయస్సు 87 సంవత్సరాలు. నడవటానికి ఓపిక లేకున్నా జగన్‌పై ఉన్న ప్రేమతో ఇక్కడ దాక వచ్చా. జగన్‌ను చూసి వేళ్తే ఆనందంగా ఉంటుంది.

-చప్పారపు రాధమ్మ, రొంపిచర్ల

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం బుధవారం 510.60 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,394, ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటి మట్టం 809.60 అడుగుల వద్ద ఉంది.

శునకాల దాడిలో చుక్కల దుప్పి మృతి



నకరికల్లు: శునకాలు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో చుక్కల దుప్పి మృత్యువాత పడింది. ఈ సంఘటన మండలంలోని అడ్డరోడ్డు సమీపంలో ఎన్నెస్పీ కెనాల్ దరి చోటు చేసుకుంది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పురుషోత్తమరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నకరికల్లు మండలం అడ్డరోడ్డు సమీపంలోని ఎన్నెస్పీ కెనాల్ వద్ద చుక్కలదుప్పి తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. హుటాహుటిన డీఆర్‌ఓ నీలిమాదేవితో కలసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించామన్నారు. అటవీ ప్రాంతంలో నీటికోసం, మేతకోసం రాత్రి వేళల్లో పొలాల్లోకి రావడంతో శునకాలు దాడి చేసినట్లు భావిస్తున్నట్లు తెలిపారు. సుమారు 3 సంవత్సరాల వయస్సు ఉండవచ్చన్నారు. పంచనామా అనంతరం శివాపురం తండా సమీపంలోని అటవీ ప్రాంతంలో దహనం చేసినట్లు తెలిపారు.

ప్రశాంతంగా టోఫెల్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ విద్యార్థుల్ని ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన టోఫెల్ పరీక్ష బుధవారం జిల్లాలోని ఎంపిక చేసిన 328 పాఠశాలల్లో నిర్వహించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాల్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పరీక్షను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. టోఫెల్ ప్రిపరేటరీ సర్టిఫికేషన్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 328 పాఠశాలల్లో 3,4,5 తరగతులు చదువుతున్న 9,884 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్, స్మార్ట్ టీవీలపై ప్రశ్నలు డిస్‌ప్లే చేసి, వాటికి సమాధానాలు రాసే విధంగా చేసిన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో పరీక్ష నిర్వహణను ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డితో పాటు డీసీఈబీ కార్యదర్శి జి. లలిత ప్రసాద్, డీవైఈవోలు పరిశీలించారు.